'పెద్ది' టీమ్ ను అభినందించిన మెగాస్టార్ చిరంజీవి

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడంతో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని అభినందించారు. దర్శకుడు బుచ్చిబాబు సానా, ఇతర యూనిట్ సభ్యులు ఇవాళ చిరంజీవిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా చిరంజీవి వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సినిమా ఘన విజయం సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జూన్ 4న విడుదలైన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 345 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, విజయవంతంగా థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రంలో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్, బోమన్ ఇరానీ కీలక పాత్రలు పోషించగా, అప్పలసూరి అనే ముఖ్యమైన పాత్రలో జగపతి బాబు నటనకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి.

ఈ సందర్భంగా చిరంజీవి తమను అభినందించిన ఫొటోలను 'పెద్ది' చిత్ర బృందం ఎక్స్ వేదికగా పంచుకుంది. "మెగాస్టార్ గారు 'పెద్ది' బ్లాక్‌బస్టర్ విజయంపై చిత్ర బృందాన్ని అభినందించారు" అని పోస్ట్‌లో పేర్కొంది.

మెగా ఆఫర్ కొట్టేసిన బ్యూటీ..

టాలెంటెడ్ అండ్ బ్యూటిఫుల్ యాక్ట్రెస్ నివేదా పేతురాజ్ మళ్లీ ఫుల్ ఫామ్‌లోకి వచ్చేసింది. కొంతకాలం పాటు వెండితెరకు కాస్త గ్యాప్ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు వరుస క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా మారుతోంది. ఇటీవలే చిత్ర పరిశ్రమలో సక్సెస్‌ఫుల్‌గా పదేళ్లు పూర్తి చేసుకున్న నివేదా, సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని పంచుకుంటూ ఎమోషనల్ పోస్టులు పెట్టింది.

లెజెండరీ డైరెక్టర్ సినిమాతో రీ-ఎంట్రీ..

ఇటీవల లెజెండరీ ఫిల్మ్‌మేకర్ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన 61వ చిత్రం 'సింగీతం'లో నివేదా పేతురాజ్ ఒక కీలక పాత్రలో మెరిసింది. ఇందులో ఆమె కనిపించేది కొద్దిసేపే అయినప్పటికీ.. తనదైన నటనతో ప్రేక్షకులపై బలమైన ముద్ర వేసింది. ఈ సినిమాతో ఆమె పెర్ఫార్మెన్స్‌కు మంచి మార్కులే పడటమే కాకుండా ఇండస్ట్రీలో సరికొత్త బజ్ క్రియేట్ అయింది.

మెగాస్టార్ 158లో క్రేజీ ఛాన్స్.. సెట్స్‌లోనే సెలబ్రేషన్స్!

ఇదిలా ఉంటే, నివేదా పేతురాజ్ కెరీర్‌లో ఇప్పుడు ఒక భారీ ఆఫర్ దక్కినట్లు తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'Mega 158'లో నివేదా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. విశేషం ఏంటంటే.. ఆమె ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి పదేళ్లు పూర్తయిన సందర్భంగా, 'Mega 158' మూవీ సెట్స్‌లోనే చిత్ర యూనిట్ సమక్షంలో కేక్ కట్ చేసి ఈ మైల్‌స్టోన్‌ను సెలబ్రేట్ చేసుకుంది. దీనికి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం నెట్టింట విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి.

'పాల్లాచి' షెడ్యూల్ పూర్తి..

కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన మొదటి షెడ్యూల్‌ను తమిళనాడులోని పాల్లాచి పరిసర ప్రాంతాలలో విజయవంతంగా పూర్తి చేశారు. ప్రధాన తారాగణంపై కొన్ని కీలకమైన యాక్షన్ , ఎమోషనల్ సీన్లను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాలో నివేదాతో పాటు అనస్వరా రాజన్, ప్రియమణి, రచితా రామ్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. రాక్‌స్టార్ థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం తదుపరి షెడ్యూల్ త్వరలోనే ప్రారంభం కానుంది. బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్టులతో నివేదా పేతురాజ్ కెరీర్ మళ్లీ ఊపందుకోవడం చూస్తుంటే, ఆమె సెకండ్ ఇన్నింగ్స్ మరింత స్ట్రాంగ్‌గా సాగడం ఖాయంగా కనిపిస్తోంది.

అలియా భట్‌పై ట్రోలింగ్ పై
షాహిద్ కపూర్ స్పందన

కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న తర్వాత బాలీవుడ్ నటి అలియా భట్‌పై సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలు, ట్రోలింగ్ ఇటీవల చర్చనీయాంశంగా మారాయి. ఈ విమర్శల వెనుక ప్రణాళికాబద్ధమైన పీఆర్ వ్యూహం ఉందంటూ వచ్చిన ఆరోపణలు కూడా సినీ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన షాహిద్, ప్రత్యేకంగా ఎవరి పేరును ప్రస్తావించకపోయినా, సోషల్ మీడియా కథనాలు, పరిశ్రమలోని వాస్తవ పరిస్థితులపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. తాను ప్రత్యక్షంగా చూసిన లేదా నిర్ధారించుకున్న విషయాలనే నమ్ముతానని, విన్న ప్రతి సమాచారాన్ని వెంటనే నిజమని భావించనని స్పష్టం చేశారు. ఏ అంశంపైనా పూర్తి అవగాహన లేకుండా నిర్ణయాలకు రావడం సరైంది కాదని పేర్కొన్నారు.

ప్రజల దృష్టిలో ఉండే వ్యక్తులు తమ గురించి ఇతరులు సృష్టించే అభిప్రాయాలకు పూర్తిగా లోనుకాకూడదని షాహిద్ సూచించారు. సోషల్ మీడియా యుగంలో ప్రచారం, ప్రతిచర్యలు చాలా వేగంగా మారుతున్నందున, నిజానిజాలు తెలుసుకోవడం మరింత ముఖ్యమైందన్నారు.

ఇక సెలబ్రిటీల ఇమేజ్ నిర్మాణంపై మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రేక్షకుల ఆలోచనా విధానం ఎంతో మారిందన్నారు. కృత్రిమంగా సృష్టించిన ఇమేజ్‌ల కంటే సహజత్వం, నిజాయతీని ప్రజలు ఎక్కువగా ఆదరిస్తున్నారని తెలిపారు. గతంలో పీఆర్ వ్యవస్థలు సెలబ్రిటీల ఇమేజ్‌ను నియంత్రించేవని... ఇప్పుడు ప్రేక్షకులు స్వతంత్రంగా అభిప్రాయాలు ఏర్పరుచుకుంటున్నారని చెప్పారు. అందుకే నటీనటులకు నిజాయతీ, పారదర్శకత గతంతో పోలిస్తే మరింత అవసరమని అభిప్రాయపడ్డారు.

'కాలా హిరన్' సినిమాపై సల్మాన్ ఖాన్ న్యాయపోరాటం

బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ తన జీవితంలోని వివాదాస్పద ఘటన ఆధారంగా తెరకెక్కుతున్న 'కాలా హిరన్: ది బాటిల్ ఫర్ లెగసీ' చిత్రంపై న్యాయపోరాటానికి దిగారు. ఈ సినిమా నిర్మాణం, ప్రచారం, విడుదలను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ చిత్రం తన వ్యక్తిగత హక్కులను ఉల్లంఘించడమే కాకుండా, తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా ఉందని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

సివిల్ ప్రొసీజర్ కోడ్ కింద నిర్మాత అమిత్ జానీ, జానీ ఫైర్‌ఫాక్స్ ఫిల్మ్స్, దర్శకుడు భరత్ శ్రీనాతే, కాస్టింగ్ డైరెక్టర్ అక్షయ్ పాండే తదితరులపై శాశ్వత, తాత్కాలిక ఇంజక్షన్ ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన కోరారు. ఈ కేసు పరిష్కారమయ్యే వరకు సినిమాకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, పంపిణీ, ప్రదర్శన వంటి ఎలాంటి కార్యక్రమాలను చేపట్టకుండా నిరోధించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.

1998 నాటి కృష్ణ జింకల వేట కేసు ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారని, సినిమా పోస్టర్లు, ప్రచార సామగ్రిలో తన పేరును, ఫొటోను అనుమతి లేకుండా వాడుకుంటున్నారని సల్మాన్ ఆరోపించారు. కృష్ణ జింకల వేట కేసు ప్రస్తుతం రాజస్థాన్ హైకోర్టులో విచారణ దశలో ఉన్నందున, సినిమా విడుదల న్యాయపరమైన ప్రక్రియపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ అంశంపై సల్మాన్ ఖాన్ బృందం ఏప్రిల్ 24నే చిత్ర యూనిట్‌కు లీగల్ నోటీసులు పంపింది. అయితే, వారి నుంచి సరైన స్పందన రాకపోవడంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరోవైపు, ఈ సినిమా ఏ వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని నిర్మించింది కాదని, వన్యప్రాణి సంరక్షణ కోసం రెండు దశాబ్దాలుగా బిష్ణోయ్ సామాజిక వర్గం చేసిన పోరాటాన్ని, వారి త్యాగాన్ని ఆవిష్కరించే ప్రయత్నమని నిర్మాత అమిత్ జానీ గతంలో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని సల్మాన్ తరపు న్యాయవాదులు కోరారు.

'సింగ'... గోపీచంద్ బర్త్‌డే స్పెషల్‌గా
కొత్త మూవీ టైటిల్ గ్లింప్స్

మ్యాచో స్టార్ గోపీచంద్ తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. ఆయన కథానాయకుడిగా రాబోతున్న 34వ చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు 'సింగ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మేరకు చిత్ర బృందం ఓ ప్రత్యేకమైన టైటిల్ గ్లింప్స్‌ను కూడా విడుదల చేసింది.

విడుదలైన టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. "గాయపడిన అడవికి అతడే ప్రళయం.. పవిత్రతకు ముప్పు వస్తే అతడే రక్షణ కవచం" అంటూ గ్లింప్స్‌లో వినిపించిన వాయిస్ ఓవర్ సినిమా కాన్సెప్ట్‌ను తెలియజేస్తోంది. టైటిల్‌కు తగ్గట్టే గోపీచంద్ ఈ సినిమాలో మరో పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారని స్పష్టమవుతోంది.

ఈ చిత్రానికి వి. వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గోపీచంద్ సరసన అనార్కలీ నాజర్ హీరోయిన్‌గా నటిస్తోంది. సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, శ్యామ్‌దత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తుండటం విశేషం. పుట్టినరోజున విడుదలైన 'సింగ' టైటిల్ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

'వీరభద్రుడు' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!

సూర్య కథానాయకుడిగా తమిళంలో నటించిన సినిమానే 'కరుప్పు'. తెలుగులో ఈ సినిమాను 'వీరభద్రుడు' టైటిల్ తో విడుదల చేశారు. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 15వ తేదీన థియేటర్లకు వచ్చింది. 130 కోట్ల బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, 300 కోట్లకి పైగా వసూలు చేయడం విశేషం. త్రిష .. ఆర్జే బాలాజీ ..శ్వాసిక కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఈ రోజు నుంచి తమిళంతో పాటు ఇతర భాషల్లోను 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది.

మునుస్వామి (ఇంద్రన్) తన కూతురు 'మీను' (అనఘ మాయ)ను వెంటబెట్టుకుని సిటీకి వస్తాడు. ఆమె లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఉంటుంది. లివర్ మార్పిడికి పెద్దమొత్తంలో డబ్బు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెబుతారు. అందువలన అతను తన దగ్గరున్న 60 సవర్ల బంగారాన్ని బ్యాంకులో పెట్టి డబ్బు తీసుకోవడం కోసం వస్తాడు. అయితే అతను ట్రైన్ దిగగానే దొంగలు ఆ నగలు కొట్టేసి పారిపోతారు. దాంతో తండ్రీ కూతుళ్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తారు.

పోలీసులు 45 సవర్ల బంగారాన్ని మాత్రమే రికవరీ చేయగలుగుతారు. ఆ నగలను కోర్టు ద్వారా తీసుకోమని చెబుతారు. ఆ కేసును లాయర్ బేబీ కృష్ణ (ఆర్జే బాలాజీ) తీసుకుంటాడు. కేసును ఎటూ తేల్చకుండానే బేబీ కృష్ణ టీమ్ తమ టిఫిన్ బిల్లులను మునుస్వామితో కట్టిస్తుంటారు. అలా 4 నెలలు గడిచిపోతుంది. 'మీను' ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారుతుంది. అయినా తన బంగారం తన చేతికి రాకపోవడంతో మునుస్వామి విసిగిపోతాడు.

కోర్టుకి సమీపంలో ఒక వీరభద్రస్వామి గుడి ఒకటి ఉంటుంది. స్వామికి మనసులో మాట చెప్పుకుంటే, తప్పకుండా నెరవేరుతుందని మునుస్వామి వింటాడు. తన కూతురును కాపాడమని వేడుకుంటాడు. దాంతో నేరుగా వీరభద్రుడు (సూర్య) రంగంలోకి దిగుతాడు. నేరుగా బేబీ కృష్ణకి కనిపించి, పద్ధతి మార్చుకోమని హెచ్చరిస్తాడు. దేవుడిలా అతీత శక్తులు చూపించకుండా, కోర్టుకు వచ్చి 'మీను'కి న్యాయం చేసి చూడమని అతను వీరభద్రుడికి సవాల్ విసురుతాడు. అప్పుడు వీరభద్రుడు ఏం చేస్తాడు? అవినీతి పరులపై ఎలా విరుచుకుపడతాడు? అనేది కథ.

సాధారణంగా ఎవరి చేతిలోనైనా మోసపోయినప్పుడు,మోసం చేసినవారికి తగిన గుణపాఠం చెప్పడానికి దేవుడు దిగివస్తే బాగుండునని చాలామంది అనుకుంటారు. మోసం చేసినవాళ్లు, తమని శిక్షించడానికి దేవుడు దిగివస్తాడా ఏంటి? అని నవ్వుకుంటారు. అయితే నిజంగానే దేవుడు దిగి వస్తే ఎలా ఉంటుందనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ అల్లుకున్న కథ ఇది. ఆ దేవుడు కూడా ఒక మనిషి మాదిరిగానే ఎలా పరిస్థితులను చక్కదిద్దగలిగాడు? అనే కుతూహలాన్ని రేకెత్తిస్తూ మలుపులు తీసుకుంటుంది.

ఈ కథ అంతా కూడా కోర్టు .. లాయర్ల చుట్టూ తిరుగుతుంది. కోర్టుకు ఒక ప్రొసీజర్ ఉంటుంది .. దేవుడు దిగివచ్చినా దానిని మార్చలేడు. మహిమలు లేకుండా మనిషిగా వచ్చి కోర్టు పరిధిలో న్యాయం జరిగేలా చూడమని కథానాయకుడిని ప్రతినాయకుడు సవాల్ చేయడమే ఈ కథలోని కీలకమైన మలుపుగా చెప్పుకోవాలి. శిక్షించడానికి వచ్చిన దేవుడికి పరీక్ష పెట్టడం ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. లాయర్ గా వీరభద్రుడు కోర్టుకు రావడం .. 'మీను' కేసును పరిష్కరించడం వరకూ బాగానే ఉంటుంది. ఆ తరువాత వీరభద్రుడి ప్రభావం కారణంగా, అసత్యాలు చెప్పాలనుకున్నవారు సైతం మాట తడబడిపోయి నిజాలు చెబుతూ ఉంటారు. దాంతో చకచకా కేసులు పరిష్కారమవుతూ ఉంటాయి. ఇక్కడే గ్రాఫ్ పడిపోయినట్టుగా అనిపిస్తుంది. ఎందుకంటే ఈ అంశానికి సంబంధించిన సన్నివేశాలు పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి.

తండ్రీ కూతుళ్లు లాయర్ల ఉచ్చులో చిక్కుకోవడం ఎమోషనల్ గా బాగా కనెక్ట్ అవుతుంది. న్యాయమూర్తులు .. న్యాయవాదులు .. పోలీసులు .. రౌడీలు కుమ్మక్కయితే ఒక సామాన్యుడికి ఆ దేవుడే దిక్కు అనే పాయింట్ ను టచ్ చేస్తూ వెళ్లిన తీరు ఆకట్టుకుంటుంది. దేవుడైనా సరే దిగివస్తే, మనుషుల చేతిలో మోసపోవలసిందే అనే విషయాన్ని ఆవిష్కరించిన విధానం మెప్పిస్తుంది. కష్టాల్లో ఉన్న ఒక వ్యక్తి కన్నీరు దొంగలను కదిలించి వేస్తుంది గానీ, పోలీసులు .. లాయర్ల హృదయాలను కరిగించలేపోవడమనే సీన్ హైలైట్ గా నిలుస్తుంది.

ఈ సినిమాలో ఆశ్చర్యకరమైన విషయం ఒకటుంది. అది ఏంటంటే హీరో సూర్య ఎంట్రీ, మొదటి అరగంట దాటిన తరువాతనే ఉంటుంది.ఇక మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే లాయర్ వీరభద్రుడుగా వచ్చింది సాక్షాత్తు దేవుడని తెలిసిన ఆ విషయాన్ని విలన్ ఈజీగా తీసుకోవడం. ఇక వీరభద్రుడు .. ప్రీతీ ద్వారా పరిష్కరించే రెండో కేసుకు సంబంధించిన సీన్ అంతగా ఇంపాక్ట్ చూపలేకపోయింది.

వీరభద్రుడిగా సూర్యలుక్ .. వీరభద్రస్వామి నేపథ్యంలో వచ్చే సీన్స్ .. అందుకు సంబంధించిన గ్రాఫిక్స్ .. తండ్రీ కూతుళ్ల ఎమోషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. కొన్ని సీన్స్ వాస్తవానికి చాలా దగ్గరగా వెళితే, మరికొన్ని సన్నివేశాలు చాలా తేలికగా తేలిపోతూ ఉంటాయి. బలమైన కొన్ని సన్నివేశాలు మాత్రమే బాగున్నాయని అనిపిస్తుంది అంతే.

రిపోర్టర్లు కావలెను

V3 NEWS
ప్రజా "విశ్వంభర"
తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com